# సులోచన



హైమా భార్గవ్

"ఓం నమో వెంకటేశాయ"... స్పీకర్ల నుండి పదే పదే వినబడుతున్న నారాయణ మంత్రం నా నరనరాల్లోనూ ఏదో తెలియని వివశత్వాన్ని, భక్తిని కలిగిస్తుంటే గర్భగుడిలోకి అడుగుపెట్టాను. వాస్తవ ప్రపంచం నుండి విడివడి ఏదో స్వాప్నిక జగత్తులోకి అడుగు పెట్టిన భావన....

ఎదురుగా సన్నని తిరుచూర్ణపు నామంతో, పచ్చల అంగీలో మనోహరమైన రూపంతో నేత్ర దర్శన మిస్తున్న శ్రీహరిని నిలువెల్లా చూస్తూ దర్శనం ముగించుకుని, అయిష్టంగానే స్వామిని వదలిపెట్టి ముందుకు సాగాను.

ఎన్ని సార్లు చూసినా పూర్తిగా చూసిన సంతృప్తి ఎందుకు కలగదో నాకు అర్థం కాదు.

"మీకు నేత్ర దర్శనం అంటే ఎందుకంత ఇష్టమో ఈరోజు బాగా అర్థమైంది..." ప్రేమగా అంది నా శ్రీమతి లక్ష్మి.

"ఎలా?" కుతూహలంగా చూశాను తన వైపు.

'స్వామి మనవైపు చూస్తున్న ఫీలింగ్ కలిగింది. ఆ పచ్చల పైజమాలో ఎంత అందంగా ఉన్నాడో' పరవశంగా అంది లక్ష్మి.

"ఎవరో మార్వాడీ భక్తులు మూడు రంగుల్లో అలాంటి అంగీలు ఇచ్చారట. అన్నీ రంగులూ బాగుంటాయి. కేవలం నేత్ర దర్శనం రోజే వాటిని వేస్తారు" అన్నాను.

నేనూ, లక్ష్మి కాసేపు మండపం ముందున్న అరుగుమీద కూర్చుని గుడినుండి బయటి కొచ్చేశాము. పడమట మాడ వీథిలో ఉన్న మైసూరు సత్రంలో విడిది.

ఈ సరికి రాజా వచ్చేసి ఉంటాడు. వాడిని చూడాలని నా మనసు కొట్టుకుంటోంది. కొండకు రాగానే రాజా వచ్చాడా అని భాస్కర్‌ను అడిగాను. "ఉదయాన్నే వచ్చాడు. నువ్వు సాయంత్రంలోగా వస్తావని చెప్పాడు" అన్నాడు భాస్కర్. "వాడి కెలా తెలుసు?" అంటూ ఆశ్చర్యంగా అడిగాను. "నువ్వు నేత్రదర్శనానికి తప్పనిసరిగా వస్తావని చెప్పాడు" అంటూ చిరునవ్వు నవ్వాడు భాస్కర్. "అవున్లే... నువ్వు ఐ స్పెషలిస్ట్‌వి కదూ" అంటూ జోకాడు గోపీగాడు. రాజా, వాళ్ళావిడ ఎక్కడికె వెళ్ళారని గోపీ చెప్పడంతో నేను, లక్ష్మి గుడికి బయల్దేరాము. నా అలవాటు రాజాకు ఇంకా గుర్తుందని తెలియగానే నా మనసుకు చాలా తృప్తి కలిగింది.

నేను, రాజా కొండమీది ఎలిమెంటరీ స్కూల్లోనూ, హైస్కూల్లోనూ కలిసే చదివాము. తిరుపతిలో ఇంటర్మీడియెట్ వరకు ఒకే క్లాసులో ఉన్నా, వాడు ఇంజనీరింగ్‌లోనూ, నేను మెడిసిన్ లోనూ చేరడంతో కాలేజీలు వేరయ్యాయి. అయినా మా స్నేహానికి ఏ ఆటంకం రాలేదు. ఇంటర్ కాలేజియేట్ కాంపిటిషన్స్‌లో వాడికి తెలుగు పాటల్లో, నాకు హిందీ పాటల్లో ప్రైజులొచ్చేవి. ఉద్యోగ రీత్యా నేను హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. రాజా కూడా ఓ ఏడాదిపాటు హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. తర్వాత ఖరగ్‌పూర్‌లో మంచి జాబ్ రావడంతో వెళ్ళి పోయాడు. మేమిద్దరం దూరంగానే ఉన్నా ఉత్తరాలు మా మధ్య వారధిని కడుతూనే ఉన్నాయి. మూడు నెలల క్రితం రాజా రాసిన ఉత్తరం నాకు కాస్త బాధనే కలిగించిందని చెప్పాలి. తను సులోచన అనే అమ్మాయిని గాఢంగా ప్రేమించాననీ, అనుకోకుండా తమ పెళ్ళి జరిగిందని, తను కలిసి నప్పుడు అన్నీ వివరాలు చెబుతానని రాశాడు. నాకు చాలా బాధ కలిగినా వాడి పరిస్థితులు ఎలాంటివో తెలియదనే అని సరిపెట్టుకుని మంచి గిఫ్ట్‌ను పంపించాను. తన పెళ్ళి ఫోటోనైనా రాజా పంపించలేదు. మా ఇద్దరితోనూ మంచి స్నేహం ఉన్న భాస్కర్ నాకు పెళ్ళి శుభలేఖ పంపిస్తూ కొండకు తప్పకుండా రమ్మని, రాజా కూడా వస్తున్నాడనీ రాశాడు. ప్రాక్టీసును, పేషంట్లనూ నాలుగు రోజుల పాటు వదిలించుకుని నేను, లక్ష్మి కొండకు వచ్చాము.

ఆలోచనల మధ్యనే నేను, లక్ష్మి విడిదిని చేరుకున్నాము. నా కళ్ళు రాజాకోసం ఆత్రుతగా వెదికాయి. ఫ్రెండ్స్ మధ్య కూర్చుని హస్కు కొడుతున్న రాజా నన్ను చూడగానే "హాయ్ రాధా! అంటూ ముందుకొచ్చి చెయ్యి ఊపేశాడు. లక్ష్మిని పలకరించాడు.

"ఇంతకూ మీ ఆవిడేది?" అన్నాను సస్పెన్స్ భరించలేక. "తను తయారౌతోంది... పెళ్ళి ఎవరికైనా ముందు మనం మేకప్ కావాలి కదా" అంటూ నవ్వాడు.

పది నిముషాల తర్వాత రాజా లోపలికి వెళ్ళి సులోచనను వెంట బెట్టుకుని వచ్చాడు. "వీడే మా రాధా రమణ, మిసెస్ లక్ష్మీ రమణ" అంటూ మా ఇద్దర్నీ పరిచయం చేశాడు.

నేను యాంత్రికంగా మాట్లాడుతున్నా నా కళ్ళు సులోచన ముఖంమీదే నిలిచిపోయాయి. ఎంత అందంగా ఉంది! అనుకోకుండా ఉండలేక పోయాను. ముఖ్యంగా ఆ కళ్ళు... ఎంత అందంగా ఉన్నాయో! బాపూగారు చూస్తే వెంటనే ఆ అమ్మా యిని హీరోయిన్‌గా పరిచయం చేస్తారని పించింది. సులోచన పెదాలతో బాటు కళ్ళు కూడా నవ్వుతాయి. ఆ నవ్వులోనూ, నడకలోనూ, మాట లోనూ ఏదో ఆకర్షణ. చందనం రంగు పట్టుచీరలో ఎంతో అందంగా ఉంది. సభ్యత కోసం చూపులు పక్కకు తిప్పుకున్నాను. నా స్నేహితుడి భార్యను చూసి చలించే దౌర్భాగ్యం నాలో లేదు. కానీ ఓ చక్కటి పెయింటింగ్‌నో, అందమైన పువ్వునో, దృశ్యాన్నో చూడకుండా ఎలా వుండగలం?

"మా ఆవిడ లక్ష్మి... గైనకాలజిస్ట్" అంటూ సులోచనకు పరిచయం చేశాను.

వాళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు.

"కంగ్రాట్స్ రాజా! చాలా లక్కీ ఫెలోవి. నీ సెలక్షన్ అద్భుతంగా ఉంది" అన్నాను రాజాకు మాత్రం వినబడేలాగా ఎప్పటిలాగే.

ఓ చిరునవ్వు విసిరాడు వాడు.

"మీరు రఫీ పాటలు చాలా బాగా పాడతారట కదా" అంది సులోచన.

"ఆ ఏదో... మా రాజాలాగ ప్రొఫెషనల్‌గా పాడను" అన్నాను, కాస్త సిగ్గుపడుతూ.

"ప్రొఫెషనల్‌గా పాడకపోయినా ఎమోషనల్‌గా పాడతారు" అంది నా శ్రీమతి.

"నీకు తెలియదు కదూ. మా సులోచన కూడా చాలా బాగా పాడుతుంది" అన్నాడు రాజా.

"అలాగా!" అన్నాను ఆశ్చర్యంగా చూస్తూ

"ఖరగ్‌పూర్ తెలుగు అసోసియేషన్‌లో ఉగాదికి పాటల పోటీ పెట్టారు. మగవాళ్ళలో నాకు, ఆడవాళ్ళలో సులోచనకు ప్రైజు లొచ్చాయి. మా మొదటి పరిచయం అలా జరిగింది" అన్నాడు రాజా.

"నే నొక్కదాన్నే అన్నమాట శ్రోతను, మీలాగా పాడలేను" అంది లక్ష్మి.

"అందరూ పాడితే వినేవాళ్ళు ఎవరండీ - శ్రోతలే ముఖ్యం!" అన్నాడు రాజా.


ఖరగ్‌పూర్‌లో ఏదైనా తెలుగు ప్రోగ్రామ్స్ జరిగితే తను, సులోచన కలిసి డ్యూయెట్లు పాడతామని.... ఇలాంటివే మరెన్నో విశేషాలు చెప్పసాగాడు రాజా.


నా మనసులో ఎందుకో సన్నటి బాధ మొదలైంది. భార్యాభర్తలిద్దరూ చక్కగా పాడగలిగితే ఎంత బాగుంటుంది! సంసారమే సంగీతంలా ఉండదూ. అలా ఉండాలంటే ఎంతో అదృష్టం చేసుకోవాలి.

సులోచన, లక్ష్మి కబుర్లు చెప్పుకుంటుంటే నేను, రాజా బాతాఖానీ వేశాము.

"అసలు నీ పెళ్ళి అంత హఠాత్తుగా ఎందుకు జరిగింది?" అన్నాను ఆత్రుతగా.

'సులోచనను చేసుకుంటానంటే మా ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు. సులోచనా వాళ్ళు మధ్య తరగతి కంటే కిందిస్థాయి వాళ్ళు. ఈలోగా






సులోచన మదర్‌కు సీరియస్‌గా జబ్బు చేసింది. కూతురి పెళ్ళి చూడలేదని ఆవిడ దిగులు పడుతుంటే రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాను. సులోచన మదర్ చనిపోయింది. అమ్మ, నాన్న నా మీద కోప్పడ్డా ఇప్పుడు బాగానే ఉన్నారు. ఈ గొడవల్లో మేము ఎక్కడికీ వెళ్ళలేదు. భాస్కర్ పెళ్ళని తెలియగానే సరదాగా తిరిగి రావాలనుకున్నాము' అన్నాడు రాజా.

సులోచన లాంటి వ్యక్తికోసం తల్లినీ, తండ్రినీ ఎదిరించాడంటే అందులో వింతేమీ కనబడలేదు నాకు.

✦ ✦ ✦

రాజాతో చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుని ఎంతో ఫ్రీగా తిరిగి ఎంజాయ్ చెయ్యాలనుకున్న నాకు కాస్త ఆశాభంగమే కలిగింది. రాజా ఖరగ్‌పూర్ వెళ్లాక నేను చూడలేదు. ఉత్తరాల్లోని మనిషిని, కళ్ల ముందు కనుబడే మనిషికి చాలా భేదం ఉన్నట్లు నాకు మరీ మరీ అనిపిస్తోంది.

భార్యంటే ఎంత ప్రేమ ఉన్నా ఆ ప్రేమను మరీ అతిగా ప్రదర్శించడం నాకు గిట్టదు. కానీ రాజా "సులూ! సులూ!" అంటూ సులోచన చుట్టూ తిరగడం, ఆవిడ స్టయిల్‌గా నవ్వడం, ఇద్దరూ చేతులు పట్టుకుని నడవడం, ఆవిడ ఎక్కడుంటే ఈయన అక్కడుండటం నాకు కాస్త ఎబ్బెట్టుగానే అనిపించింది. నేను రాజా కోసం ఎంతగానో కలవరిస్తాను. వాడంటే ప్రాణం పెడతాను. కానీ వాడు మాత్రం ఇలా భార్య చుట్టూ తిరుగుతూ నన్ను నిర్లక్ష్యం చెయ్యడం నాకు మాత్రం చాలా బాధను కలిగిస్తోంది.

"అలా టి.బి. గార్డెన్స్ వైపు వాకింగ్ వెళ్దాం" అన్నాను రాజాతో.

"ఇప్పుడొద్దురా. సులోచన కూడా చూడలేదు. రేపెళ్దాం" అన్నాడు రాజా.

నాకు ఒళ్లు మండిపోయింది.

భోజనాలయ్యాక ఫ్రెండ్సందరూ పాటలు పాడమని అడిగితే రాజా 'నిన్న లేని అందమేదో' పాడాడు. 'పూచిన ప్రతి తరు వొక వధువు పువ్వు పువ్వు పొంగెను మధువు' అంటూ సులోచన వైపు పరవశంగా చూడటం నా దృష్టిని దాటిపోలేదు. ఇక భార్యాభర్త లిద్దరూ పురజనుల కోరికపై పాత పాటలు పాడటం మొదలెట్టారు. నాకు ఎంతో ఇష్టమైన 'సుమంగళి' పాటలు మామూలప్పుడైతే ఎంజాయ్ చేసి ఉండేవాడినేమో. కానీ ఇప్పుడు వీళ్లు ఏంటో ఫీలై పోతూ పాడుతుంటే నాకు చాలా చిరాకేసింది.

నేను సిగరెట్ ముట్టించుకుని ఓ పక్కగా కూర్చున్నాను. లక్ష్మి వచ్చి నా పక్కన కూర్చుంది. తనకు నా మనసులోని భావాలూ చాలా త్వరగా అర్థమైపోతాయి.

"రాజాలో చాలా మార్పు వచ్చింది కదూ" అంది.

"ఎవరు మారితే మన కెందుకు... మనం మనలా ఉండాలి" అన్నాను.

"ఎంత లవ్ మారేజయినా అంతలా భార్య చుట్టూ తిరుగుతూ 'సులూ! సులూ!' అనుకుంటూ ఉంటే చాలా ఎబ్బెట్టుగా ఉంది. అందరూ వీళ్లను చూసి నవ్వుకుంటున్నారు" అంది లక్ష్మి.

"ఊళ్లో వాళ్లు ఎలా పోతే మనకెందుకు?" అన్నాను.

"ఊళ్లో వాళ్లయితే బాధ లేదు. రాజా ఇలా ఉన్నందుకే బాధ" అంది లక్ష్మి.

"నాకు లేని బాధ నీ కెందుకు?" అన్నాను లేని గంభీర్యాన్ని తెచ్చి పెట్టుకుని.

"నన్ను చూసి చెప్పండి. నిజంగా మీకు బాధగా లేదూ" అంటూ నిలదీసింది లక్ష్మి.

నేను మౌనంగా ఉండిపోయాను.

'మన పెళ్లయిన కొత్తలో మీరిలా ఉన్నారా? రాజా రాజా అంటూ అతని చుట్టూ తిరగలేదూ?' నిష్ఠూరంగా అంది లక్ష్మి.

అవును. రాజా హైదరాబాద్‌లో ఉన్నప్పుడే నా పెళ్లయింది. మేమిద్దరం కలిసి సినిమాలకు వెళ్లే వాళ్లం. రాత్రి పదకొండయినా రాజా కబుర్లు చెబుతుంటే నేను ఎంజాయ్ చేసేవాడిని. లక్ష్మితో గడిపే టైమ్ కన్నా రాజాతో గడిపే టైమ్ ఎక్కువగా ఉండేది.

'మీరు రాజాతో మాట్లాడుతూ నన్ను నిర్లక్ష్యం చేస్తుంటే నాకెలా ఉంటుంది? తొమ్మిది వరకు పేషంట్లు. రాత్రి పదకొండున్నర వరకు రాజాతో కబుర్లు, ఇక మనకు మాట్లాడే టైమ్ ఎక్కడుంది?' అని లక్ష్మి బాధ పడుతుంటే తనది చాలా సంకుచిత స్వభావమని నా కనిపించేది.

"నువ్వు పెళ్లయ్యాక దగ్గరయ్యావు. కానీ రాజా, నేను చిన్నప్పటి నుండి ఫ్రెండ్సమి. నీకంటే కూడా వాడే నాకు క్లోజ్. నువ్వు పొజెసివ్‌గా ఉంటే నాకు నచ్చదు అని తను చాలా బ్లంట్‌గా లక్ష్మికి చెప్పాడు. అలాంటిది అదే రాజా ఇప్పుడు భార్యే సర్వస్వ మన్నట్లు ప్రవర్తిస్తుంటే నేను లక్ష్మి పట్ల ఎంత మూర్ఖంగా ప్రవర్తించానో గుర్తొస్తోంది.

"ప్లీజ్. అవన్నీ గుర్తు చెయ్యకు" అన్నాను.

"అయామ్ సారీ" అంటూ లక్ష్మి వెళ్లిపోయింది.

పెళ్లి జరిగినంతసేపూ రాజా సులోచనతో మాట్లాడుతూనే ఉన్నాడు. సాయంత్రం అందరం గుడికి వెళ్లాం. క్యూలో, అంత రద్దీలోనూ రాజా సులోచన చెయ్యి పట్టుకుని నడవడం, 'సులూ! బాగా రష్‌గా ఉంది కదూ. ఇబ్బందిగా ఉందా అంటూ లాలనగా అడగటం... నేను గమనిస్తూనే ఉన్నాను.

కాలేజీ రోజుల్లో మగవా ళ్లెవరైనా ఇలా చేస్తే రాజా చాలా కామెంట్ చేసేవాడు. 'వాళ్లావిడను ఎలా రోడ్డు దాటిస్తున్నాడో చూడు. ఆవిడను ఎవరో ఎత్తుకుపోతారన్నట్లు చెయ్యి పట్టుకోవడం ఏంటి?' అంటూ మమ్మల్ని నవ్వించేవాడు. అలాంటిది వాడే ఇలా చేస్తూ నవ్వులపా లవుతున్నాడు. టి.బి. గార్డెన్స్‌కు నడిచి వెళ్తుంటే సులోచనకు రెండో నెలని తెలిసింది. అక్కడ తోటల మధ్య ఉన్న మెట్లెక్కుతుంటే వీడు సులోచనకు కాపలా. తన భార్య మాత్రమే కడుపుతో ఉన్నట్లు వీర పోజు. నాకు చాలా చిరాకేసింది. పెళ్లాం ప్రెగ్నెంటని తెలియగానే ఇలా అతి జాగ్రత్త, ప్రేమ చూపిస్తే, కష్టపడకూడదని అంటే కాన్పు తర్వాత ఆ పిల్లకు విపరీతంగా ఒళ్లొస్తుందని చెప్పాలనిపించింది. ఇప్పుడు నా భార్య లక్ష్మి కూడా కడుపుతో ఉంది. కానీ ఇలాంటి అతి వేషాలు మాకు లేవు.

"మీరు రఫీ పాటలు చాలా బాగ పాడతారంట కదా!" అంది సులోచన.

"అంత గొప్పగా ఏం పాడను" అన్నాను నిర్లిప్తంగా.

"అదేం కుదరదు. మీరు పాడాలి" అంది సులోచన.

"పాడరా... సులోచన వినాలని ముచ్చట పడుతోంది!" అన్నాడు రాజా. అంటే సులోచన కోసం నేను పాడాలి. వీడి కోసం కాదు. నాకు చాలా కసిగా అనిపించింది. రాజాను ఎలాగైనా ఏడిపించాలన్న కోరిక నాలో బలపడటం నాకే ఆశ్చర్యంగా అనిపించింది. 'స్నేహం' సినిమాను ఇద్దరం కలిసి నాలుగు సార్లు చూశాం. 'నీవుంటే వేరే కనులెందుకు? నీ కంటే వేరే బతుకెందుకు?'

అనే పాటంటే నాకు చాలా ఇష్టం. రాజా చేత మరీ మరీ ఆ పాట పాడించుకునేవాణ్ణి. ఇవన్నీ వాడు ఎలా మర్చిపోయాడు? వాడు మాత్రం వాడి పెళ్లాన్ని కలవరిస్తుంటే నేను మాత్రం ఎలా ఊరుకుంటాను? అందుకే అన్నాను. "ఈ పాటంటే మా లక్ష్మికి చాలా ఇష్టం" అని 'ఆవాజ్ మై న దూంగా' పాడటం మొదలెట్టాను. ఆ పాటంటే నాకు చాలా ఇష్టమైనా రాజా పాడ నిచ్చేవాడు కాదు. అందులోని భావాన్నీ, ఆర్ద్రతను నేను భరించలేను అంటూ కంట తడి పెట్టేవాడు. రాజాను బాగా హర్ట్ చేయాలనే ఆ పాట మొదలెట్టాను.

"దర్ద్ భీ తూ.. చైన్ భీ తూ"... అంటుంటే సులోచన కళ్లు తుడుచు కోవడం చూశాను.

"బాధవు, ఆ బాధకు ఉపశమనానివి కూడా నువ్వే" అనే స్నేహితుడి ఆవేదన ఎంత గొప్పగా రాశాడా రచయిత.

"చాలా బాగా పాడారు" అంది సులోచన ఓ పక్క కళ్లు తడుచుకుంటూ.

"మంచి గొంతున్నా సాధన చేసి డెవలప్ చేసుకోవాలని అనుకోడు" నవ్వుతూ అంటున్నాడు రాజా.

ఒకప్పటి రాజా అయితే స్టాపిట్ అంటూ ఈ పాట పాడ నిచ్చేవాడు కాదు. నాకు తిరుమలలో ఉండాలనిపించలేదు.

ఉదయాన్నే నేను, లక్ష్మి ప్రయాణమయ్యాము. సభ్యత కోసం రాజాను, సులోచనను హైదరాబాద్‌కు ఆహ్వానించాము.

"సులోచన వాళ్ల అన్నయ్య హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఎటుదిరిగీ రావాలి" అన్నాడు రాజా.

"కనీసం అతనికోసమైనా వస్తారు కనుక మా ఇంటికి వచ్చే ప్రయత్నం చెయ్యండి" అన్నాను.

రాజా కళ్లలో బాధ కనబడుతుందేమో అనుకున్నాను. కానీ ఆ ఛాయలేం కనబడలేదు. చిరునవ్వు నవ్వాడు. నా విజిటింగ్ కార్డ్ తీసి రాజాకు ఇచ్చాను. వాడు దాన్ని పర్సులో పెట్టుకుంటుంటే సులోచన ఫోటో నా కంటబడింది. ఈవిడ జీవితంలోనూ, పర్సులోనూ అన్నిటా నిండి పోయింది. కానీ ఒకరి ఆగమనంతో స్నేహితులు నిష్క్రమణ తప్పదా? నే నెందుకు అలా ఉండలేక పోతున్నాను. మారిపోయే స్నేహితులను చూస్తే నాకు చిన్నప్పటి నుండి బాధ, దిగులు. వీళ్లలా నేను మారకూడదన్న పట్టుదల. నేను మారలేక పోవడం నా బలహీనతా? ఔన్నత్యమా? అనేది నాకు తెలియడం లేదు. ఒక్కోసారి బలహీనతలు ఔన్నత్యాలుగా, ఔన్నత్యాలు బలహీనతలుగా కనబడుతాయి. ఏది నిజం? ఏది అబద్ధం?

అందరి దగ్గరా సెలవు తీసుకుంటుంటే నాకు చాలా బాధగా ఉంది. బస్సు ఫస్ట్ ఘాట్ రోడ్ దిగుతోంది. ఈ రోడ్డు నా చిన్నప్పటి నుండి ఇలాగే ఉంది. స్నేహితులు, ఆప్తులు అందరూ మారిపోతున్నారు. కానీ ఈ కొండ, కోన, కోనేరు, రోడ్డు... ఇవన్నీ ఇలాగే ఉన్నాయి. మెన్ మే కమ్ అండ్ మెన్ మే గో.. బట్ ఐ గో ఆన్ ఫర్ ఎవర్ అన్న బ్రూక్ పద్యం గుర్తొచ్చి కళ్లు చెమ్మగిల్లాయి.

హైదరాబాద్‌కు వచ్చాక రెండ్రోజులు నేను చాలా మూడీగా ఉన్నా, మళ్లీ రొటీన్‌లో పడి నా పేషంట్లతో బిజీ అయ్యాను. ఆ రోజు నేను క్లినిక్‌లో పేషంట్ల నందరినీ చూసేశాను. ఆఖరి పేషంట్‌ను చూస్తుంటే రాజా ఫోను వచ్చింది - తను, సులోచన వస్తున్నారని, మా కొత్త ఇల్లు ఎక్కడుందో తెలియదు. కనుక డైరెక్ట్‌గా క్లినిక్‌కు వస్తున్నామని చెప్పాడు. వాళ్లను రమ్మని చెప్పి ఫోన్ పెట్టేశాను. మరి కాసేపటికి రాజా, సులోచన, సులోచన అన్నయ్య వచ్చారు.

"పదండి ఇంటికి వెళ్దాం" అన్నాను.

"సులోచనకు నీతో పనుంది" అన్నాడు రాజా.

'నాతో పనా? పొరబాటు. మా లక్ష్మితో పనేమో' అన్నాను నవ్వుతూ.

"లేదు. మీ తోటే" అంది సులోచన.

"చెప్పండి" అంటూ ఆమె వైపు చూశాను.

సులోచన చెప్పడం మొదలెట్టింది. వింటుంటే నా తల గిర్రున తిరిగి నట్లయింది. గబగబ సులోచనను పరీక్షించాను. నా జీవితంలో షాక్ తినడం అంటే బహుశా ఇదే మొదటిదని చెప్పగలను.

"ఇంతకు ముందు ఎక్కడైనా చెకప్ చేయించారా?" అనడిగాను.

"ఖరగ్‌పూర్‌లో చేయించాము. వాళ్లు లాభం లేదని చెప్పారు. ఇక్కడ నువ్వున్నావు కదా. ఇంకా పెద్ద హాస్పిటల్స్ ఉన్నాయి కదా. ఏదైనా మార్గం ఉంటుందేమో అనుకున్నాను".... దిగులుగా నా వైపే చూస్తూ అన్నాడు రాజా.

నాకు ఏం చెప్పాలో తోచలేదు. ఎంతో అందమైన కళ్లతో ఆత్రుతగా నా వైపే చూస్తోంది సులోచన.

ఒక డాక్టరుగా ఎందరో పేషంట్లకు నేను సాయం చేశాను. కానీ నా స్నేహితుడి భార్యకు మాత్రం సాయం చేసే అవకాశం లేకపోవడం దురదృష్టం కాక మరేమిటి?

"ఇంటికి వెళ్తూ మాట్లాడుకుందాం. మీ రెల్లి కార్లో కూరోండి" అన్నాను. సులోచన వాళ్ల అన్నయ్యతో వెళ్లింది.

"సులోచనకు దృష్టి లోపం ఉందని నీకు తెలుసా?" రాజా వైపే చూస్తు అడిగాను.

"మొదట్లో నాకు తెలియదురా. పెళ్లంటూ చేసుకుంటే సులోచననే చేసుకోవా లనుకున్నాను. సులోచనతో పెళ్లి విషయాన్ని ప్రస్తావించాను. తన దృష్టి లోపం సంగతి చెప్పింది. నేను నా నిర్ణయాన్ని మార్చుకోలేదు. అమ్మ, నాన్న పెళ్లికి ఒప్పుకోలేదు. సులోచన వాళ్లు ఆర్థికంగా కూడా చాలా తక్కువ స్థాయిలో ఉన్నారు. అయినా సరే నేను కట్నం ప్రసక్తి లేకుండా తనను పెళ్లి చేసుకున్నాను. చూసిన వాళ్లందరూ సులోచన అందాన్ని, కళ్లను, పాటలను ఎంతో మెచ్చుకుంటారు. మమ్మల్ని చూసి మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంటారు. ఆ నోళ్లతోటే 'అయ్యో పాపం' అనిపించుకోవడం మాకు నచ్చదు. అందుకే ఈ విషయం ఎవ్వరికీ తెలియనివ్వను. తనకు ఎదురుగా ఉన్న వస్తువులు, దృశ్యం మాత్రమే కనబడుతాయి. కళ్లు ఏ మాత్రం పక్కకు తిరిగినా ఏమీ కనబడదు. అన్ని ఏంగిల్స్‌లోనూ చూడలేదు.

ఎక్కడికి వెళ్లినా నేను తన పక్కనే ఉంటాను. తను చాలా వరకు మేనేజ్ చేస్తుంది. ఒక్కసారి తడబడుతుంది. ఎక్కడైనా తట్టుకుని పడుతుందేమోనని భయం. అందుకే తన పక్కనే ఉంటాను. చాలా మంది పెళ్లాం వెనక తిరుగుతానని, హెన్ పెకడ్ హబ్బీనని అంటారు. అయ్యోపాపం అనే జాలికన్నా ఆ విషయం అందరికీ తెలిస్తే ఎదురయ్యే సమస్యల కన్నా, ఎదుటి దాడి అసూయను, కామెంట్స్‌ను భరించడమే నయమనిపిస్తుంది. సులోచనకు దిగులు - భయం రాకుండా నేను తన నెప్పుడూ ప్రేమిస్తుంటానని తెలిసేలా ప్రకటించక తప్పదు. ఎవరేమన్నా నేను కేర్ చెయ్యను. నా బెస్ట్ ఫ్రెండ్స్ నన్ను అర్థం చేసుకుంటే చాలు" అంటూ రాజా నా కళ్లల్లోకి చూసి తల వంచుకున్నాడు.

"సారీ రాజా! అయామ్ రియల్లీ సారీ. సులోచన కళ్లలో ఉన్న డిఫెక్ట్‌ను ట్యూబులార్ విజన్ అంటారు. కంటి నరాల బలహీనత వల్ల, లేకపోతే గ్లాకోమా ప్రభావం వల్ల ఇలా అవుతుంది. గ్లాకోమా కాదు కనుక కంటి నరాల శక్తి క్రమంగా క్షీణించడం వల్లే ఇలా అయిందని చెప్పవచ్చు. ఒక విధంగా సులోచన అదృష్టవంతురాలు. ఇలాంటి పరిస్థితులో కనీసం కళ్లకెదురుగా ఉండేవి మాత్రం కనబడటం అనేది జస్ట్ లక్ అని చెప్పొచ్చు. చాలా మందిలో ఇది కూడా ఉండదు. ఈ లోపానికి ఏ చికిత్సా లేదు. అయాం సారీ...." ఎలాగో అప్పజెప్పినట్లు రాజాకు చెప్పాను. కంటి తడితో నా దృష్టి మస కేసింది.

రాజా కళ్లలోని నిరాశను చూస్తుంటే నాకు చాలా బాధగా అనిపించింది. ఆ రోజు గురువారం కావడంతో క్లినిక్ బంద్ చేసే ముందు షిర్డీ సాయి బాబా పటం ముందు అగరొత్తులు వెలిగించాను. గురువారం నాటి నేత్ర దర్శనం అంటే నాకు చాలా ఇష్టం. కానీ, ఈ రోజు నేను చూసిన నేత్ర దర్శనం నాకు ఆనందాన్ని కలిగించడం లేదు. కానీ రాజా మాత్రం దేవుడిలా కనబడుతున్నాడు.

"పద వెళ్దాం. నువ్వుంటే సులోచనకు వేరే కళ్లెందుకు?" ప్రేమగా అంటూ రాజా చెయ్యి పట్టుకుని ముందుకు నడిచాను. ●

**సుఖమంటావా, శ్రమంటావా?**

పానీయాలు సేవిస్తూ, ఒక చోట కూచొని సంభాషించుకుంటున్న నలుగురు ఆర్మీకాప్టెన్లు, 'సెక్స్' అనేది సుఖదాయకమా, శ్రమదాయకమా అనే విషయం గురించి తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఈ లోగా ట్రే మీద సీసాలు, గ్లాసులు పెట్టుకొని ఒక ఆర్డర్లీ వారి వద్ద కొచ్చాడు. సరదాగా అతణ్ణి అడిగితే ఈ ఆర్డర్లీ ఏ మంటాడో చూద్దామని అనిపించి -

"నువ్వేమంటావోయ్? సెక్స్ సుఖం కలిగిస్తుందా, శ్రమ కలిగిస్తుందా?" అని అడిగారు.

"సుఖమే అయి ఉంటుందండీ. శ్రమతో కూడినదైతే నా అధికారులు ఆ పని నాకే అప్పజెప్పెయ్యగలరు" అని తడుము కోకుండా సమాధానం చెప్పేశాడు.

ఛాయ